# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ 27.12.2024 | 24 క్యారెట్లు 79,916.00 | కిలో వెండి 99,987.00 | 27 ℃ | సంపుటి:3 | సంచిక:65

www.vishalabharati.com




# అవిశ్రాంత యోధుడు..

## మాజీ ప్రధాని మన్మోహన్ కన్నుమూత

- ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి
- పదేళ్ల పాటు దేశ ప్రధానిగా బాధ్యతలు
- 33 ఏళ్ల పాటు ఎంపీగా సేవలు
- దేశ రూపురేఖలు మార్చిన మేధావిగా గుర్తింపు
- ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్, కేసీఆర్ నివాళులు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) ఇక లేరు. తీవ్ర అనారోగ్యంతో ఎయిమ్స్‌లో చేరిన ఆయన గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. గురువారం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో దిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. రాత్రి 9గంటల 51 నిమిషాలకు మన్మోహన్ సింగ్ మరణించారని ఎయిమ్స్ మీడియా సెల్ ప్రొఫెసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ రిమా దాదా ఒక ప్రకటనలో చెప్పారు. గురువారం(26 డిసెంబరు 2024)

..మిగతా 2 లో

# హైదరాబాద్‌కు హాలీవుడ్

## టాలీవుడ్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లడమే లక్ష్యం

- ప్రభుత్వం చిత్ర పరిశ్రమకు అండగా ఉంటుంది
- బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు కుదరదు
- మా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేం
- శాంతిభద్రతల విషయంలో రాజీ పడబోం
- సినీ ఇండస్ట్రీ ప్రభుత్వానికి సహకరించాలి
- రాష్ట్రంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేయండి
- ఇన్వెస్ట్‌మెంట్ల విషయంలోనూ సహకరించాలి
- సినీ ప్రముఖులతో సీఎం రేవంత్ రెడ్డి
- సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం





“ తెలంగాణలో ఇకపై బెనిఫిట్ షోలు ఉండవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీలో చెప్పిన మాటకే తాను కట్టుబడి ఉన్నట్లు రేవంత్ తేల్చి చెప్పారు. ఇవాళ (గురువారం) సీఎం రేవంత్ రెడ్డితో సినీ ప్రముఖులు భేటీ అయ్యారు. సినీ పరిశ్రమ అభివృద్ధి, టికెట్ రేట్లు, బెనిఫిట్ షోలు సహా పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. బెనిఫిట్ షోలు ఉండవని సీఎం చెప్పడంతో కనీసం సంక్రాంతి సినిమాలకైనా అవకాశం ఇవ్వాలని సినీ పెద్దలు కోరగా.. కుదరదని సీఎం తేల్చి చెప్పారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సంధ్య థియేటర్ ఘటనను సీఎం ప్రస్తావించారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదని సినీ పెద్దలకు ఆయన స్పష్టం చేశారు. ఇకపై బౌన్సర్ల విషయంలో సీరియస్‌గా ఉంటామని చెప్పారు. అభిమానుల్ని కంట్రోల్ చేయాల్సిన బాధ్యత సెలబ్రిటీలదే అని చెప్పారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజంను ప్రమోట్ చేయాలని వారికి స్పష్టం చేశారు. ఇన్వెస్ట్‌మెంట్ల విషయంలోనూ ఇండస్ట్రీ సహకరించాలని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు నరేందర్ రెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, నిర్మాత అల్లు అరవింద్, హీరోలు వెంకటేశ్, నాగార్జున సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం, ఇండస్ట్రీకి మధ్యవర్తిగా దిల్‌రాజు..

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "సినీ పెద్దలు చిత్ర పరిశ్రమ సమస్యలను మా దృష్టికి తెచ్చారు. వారి అనుమానాలు,

..మిగతా 2 లో

# గురుకులాల్లో చనిపోతున్న కుటుంబాలను పరామర్శించరా..?

- వారి తల్లుల శోకాన్ని ఎందుకు గుర్తించడం లేదు
- ఇది రాజకీయాలు మాట్లాడే సమయం కాదు
- శ్రీతేజ్ త్వరగా కోలుకుని బయటకు రావాలి
- ఎమ్మెల్యే హరీష్‌రావు కీలక వ్యాఖ్యలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ నేతల బృందం పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ గాయపడిన శ్రీతేజ్‌ను

..మిగతా 2 లో



ఎన్నికల సంఘంపై ప్రజలకు

# నమ్మకం పోతోంది

- మోదీ సర్కారే ప్రధాన కారణం
- తుది శ్వాస వరకు మా పోరాటం
- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

2 లో



# ట్రయాంగిల్ లవ్‌స్టోరీ

- ముగ్గురి ప్రాణం తీసిన వివాహేతర సంబంధం
- ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ సూసైడ్
- కామారెడ్డి జిల్లాలో కలకలం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు ఎస్ఐ సాయికుమార్, కానిస్టేబుల్ శృతితో పాటు మరో యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వివాహేతర బంధం కారణంగానే ఈ మూడు ప్రాణాలు కడతేరిపోయినట్లుగా పోలీసులకు ఆధారాలు లభించాయి. భిక్కనూరు ఎస్ఐ సాయికుమార్ కు పెళ్లి అయింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఆయితే ఆయనకు

..మిగతా 2 లో

# డొనేషన్లలో బీఆర్ఎస్ టాప్

- ప్రాంతీయ పార్టీల్లో మొదటి స్థానం
- 2023–24లో రూ.580 కోట్ల విరాళాలు
- దేశ వ్యాప్తంగా రెండో స్థానం
- రూ.2,244 కోట్లతో ఫస్ట్ ప్లేస్‌లో బీజేపీ
- రూ.288.9 కోట్లతో థర్డ్ ప్లేస్‌లో కాంగ్రెస్
- 2023-24 వివరాలు వెల్లడించిన ఈసీ

“ *ప్రాంతీయ పార్టీల్లో బీఆర్ఎస్ రిచెస్ట్ పార్టీగా నిలిచింది. దేశంలోని ప్రాంతీయ పార్టీలన్నింటి కంటే అత్యధిక ధనిక పార్టీగా గులాబీ పార్టీ టాప్‌లో నిలిచింది. ఏ పార్టీకి రాని విరాళాలు బీఆర్ఎస్ పార్టీ అకౌంట్‌లోకి వచ్చాయి. తమ వద్ద ఇన్ని డబ్బులు ఉన్నాయని స్వయంగా బీఆర్ఎస్ పార్టీనే వెల్లడించింది. ఈసీ వెబ్‌సైట్‌లోనూ ఆ లెక్కలను ఎంట్రీ చేశారు. పార్టీ డొనేషన్లలో బీఆర్ఎస్ దేశవ్యాప్తంగా రెండో స్థానంలో నిలిచింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ రూ.580 కోట్ల డొనేషన్లు పొందింది.*

**విశాలభారతి, స్టేట్‌బ్యూరో:** 202324 ఏడాదికి గాను అత్యధిక విరాళాలు పొందిన విషయంలో బీఆర్ఎస్ పార్టీ దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈసీ వెబ్ సైట్ ప్రకారం.. విరాళాల రూపంలో బీజేపీ అత్యధికంగా రూ.2,244 కోట్లను సాధించింది. పోయిన ఏడాదితో పోలిస్తే ఇది మూడు రెట్లు అధికం అని వెల్లడించింది. ఇక తరువాతి స్థానంలో బీఆర్ఎస్ పార్టీ నిలిచింది. రూ.580 కోట్లతో సెకండ్ ప్లేస్ సాధించింది. కాంగ్రెస్ పార్టీ రూ.288.9 కోట్లు పొందింది. డీఎంకే రూ.60 కోట్లు పొందినట్లు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వెల్లడించాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ ఖాతాలో రూ.1449 కోట్లు ఉండడం గమనార్హం. అంతకుముందు రూ.626 కోట్లతో ఒడిశాకు చెందిన బిజూ జనతాదళ్ పార్టీ టాప్ ప్లేస్‌లో ఉండేది. కానీ..

..మిగతా 3 లో



# బీసీలంటే బీజేపీకి ఇష్టం లేదా..?

- కులగణనపై వారి వైఖరి చెప్పాలి
- బీసీ డిక్లరేషన్‌పై మౌనమెందుకు
- బీజేపీపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఫైర్

2 లో

# జనగణనలోనే కులగణన..



- కేంద్రంపై కాంగ్రెస్ పోరాటం చేయాలి
- సీడబ్ల్యూసీ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి
- కులగణనలో తెలంగాణ దేశానికే మార్గదర్శి
- డీలిమిటేషన్‌లో దక్షిణాదికి నష్టం జరగొద్దు
- జనాభా ప్రాతిపదికన చేస్తే నష్టం తప్పదు
- ఏఐసీసీ వ్యూహాత్మకంగా వ్యవహరించాలి
- సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన.. సీడబ్ల్యూసీ ఆమోదం
- కులగణనతో దేశంలో విప్లవాత్మక మార్పులు
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్




# నేటి నుంచి సీఎం కప్

- పండుగ వాతావరణంలో పోటీలు
- తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సీఎం కప్ 2024కు

..మిగతా 3 లో

# మాజీ ఎంపీ మందా జగన్నాథంకు సీరియస్

- గుండె పోటు రావడంతో నిమ్స్‌లో చికిత్స
- పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



## గ్రూప్–1 ఫలితాలకు గ్రీన్‌సిగ్నల్

2 లో

## ఎర్రోళ్ల అరెస్ట్, బెయిల్

## ట్రయాంగిల్ లవ్‌స్టోరీ

తరువాయి భాగం కానిస్టేబుల్ శృతితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అది వివాహేతర బంధానికి దారి తీసింది. ఇటీవల ఈ బంధానికి ముగింపు పలకాలని శృతి నిర్ణయించుకున్నారు. ఎస్ఐ సాయి కుమార్ కి అప్పటికే పెళ్లి అయిపోవడంతో .. తనను శారీరకంగా ఉపయోగించుకంటారు కానీ పెళ్లి చేసుకుంటారన్న నమ్మకం లేకపోవడంతో ఆమె కంప్యూటర్ ఆ పరేటర్ గా పనిచేస్తున్న మరో యువకుడిని ప్రేమించింది. క్రమంగా ఎస్ఐని దూరం పెడుతూ ఆ యువకుడికి దగ్గర అయింది. శృతి తనకు దూరం అవడడం ఇష్టం లేని ఎస్ఐ.. తనతోనే ఉండాలని ఒత్తిడి చేసినట్లుగా తెలుస్తోంది. అయితే తాను మరో యువకుడ్ని ప్రేమించానని అతనితోనే కలిసి జీవిస్తానని చెబుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ అంశంపై మాట్లాడేందుకు ముగ్గురూ చెరువు కట్ట దగ్గరకు వెళ్లారు. అక్కడ ఏం జరిగిందో కానీ ముగ్గురూ నీళ్లలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారమే రెండు మృతదేహాలను బయటకు తీసినప్పటికీ మూడో మృతదేహం కనిపించలేదు. ఉదయాన్నే గజఈతగాళ్లతో వెదికారు. ఎస్ఐ మృతదేహం కూడా బయటపడింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి సమాచారం వెల్లడిస్తామని ఎస్పీ తెలిపారు.



## హైదరాబాద్‌కు హాలీవుడ్

తరువాయి భాగం

అపోహలు, ఆలోచనలను మాతో పంచుకున్నారు. ఎనిమిది సినిమాలకు మా ప్రభుత్వం స్పెషల్ జీవోలు ఇచ్చింది. పుష్ప సినిమాకు పోలీస్ గ్రౌండ్ ఇచ్చాం. తెలుగు సినిమా పరిశ్రమకు ఒక బ్రాండ్ క్రియేట్ చేయాలని నిర్ణయం తీసుకున్నాం. పరిశ్రమ బాగుండాలని కోరుకున్నాం. ఐటీ, ఫార్మాతోపాటు చిత్ర పరిశ్రమా మాకు ముఖ్యం. తెలంగాణలో అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి గద్దర్ అవార్డును ఏర్పాటు చేశాం. ప్రభుత్వం, సినిమా పరిశ్రమకు మధ్యవర్తిగా ఉండేందుకు దిల్ రాజును ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించాం. పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. సినీ పరిశ్రమ సైతం కమిటీని ఏర్పాటు చేసుకోవాలి.

**టికెట్ రేట్ల పెంపు కోసం ఇబ్బంది పెట్టొద్దు..**

తెలంగాణలో ఎక్కడైనా షూటింగ్ చేసుకుని హైదరాబాద్‌కు రెండు గంటల్లో రావొచ్చు. రాష్ట్రంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేయండి. టెంపుల్ టూరిజానికి సహకరించండి. ఇక మీదట ఆలయాల్లో షూటింగ్స్ చేసుకోండి. ప్రభుత్వం సగటు ప్రేక్షకుడిని దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తుంది. ప్రేక్షకుడికి అందుబాటులో సినిమా ఉండాలి. టికెట్ ధరలు ప్రేక్షకులు చూసే విధంగా ఉండాలి. ధరల పెంపునకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టొద్దు. సినిమా రంగానికి ప్రభుత్వ సహకారం ఉంటుంది. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపుపై మా విధానాన్ని ఇప్పటికే ప్రకటించాం. దానిపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేం. మా ప్రభుత్వం పరిశ్రమకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.

**గంజాయి, డ్రగ్స్‌పై ప్రచారం..**

గంజాయి, డ్రగ్స్‌తోపాటు సామాజిక అంశాలపైనా సినిమా పరిశ్రమ ప్రచారం చేయాలి. పరిశ్రమకు ఏది చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలే చేశాయి. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తాం. సినీ పరిశ్రమను ప్రోత్సాహించడమే మా ముఖ్య ఉద్దేశం. ముఖ్యమంత్రిగా చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత నాది. నాకు వ్యక్తిగత ఇష్టాయిష్టాలు లేవు. తెలుగు పరిశ్రమ తెలుగుకే పరిమితం కాకుండా అంతా కలిసి అభివృద్ధి చేద్దాం. ముంబైలో వాతావరణం కారణంగా బాలీవుడ్ అక్కడ స్థిరపడింది.

## గురుకులాల్లో చనిపోతున్న కుటుంబాలను పరామర్శించరా..?

తరువాయి భాగం

కేసీఆర్ సూచనతో బీఆర్ఎస్ నేతలం పరామర్శించామని తెలిపారు. "శ్రీతేజ్ కోలుకుంటున్నారు.. వైద్యానికి స్పందిస్తున్నాడు. స్పర్శ కూడా మెరుగైందని డాక్టర్లు చెబుతున్నారు. భగవంతుడి దీవెనలతో శ్రీతేజ్ కోలుకుని మళ్లీ మామూలు మనిషిలా బయటకు రావాలని కోరుకుంటున్నాం. కిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం భాస్కర్ రావు నేతృత్వంలో శ్రీతేజ్‌కు మంచి వైద్యాన్ని అందిస్తోంది. తొక్కిసలాటలో మరణించిన రేవతికి మా ప్రగాఢ సానుభూతి. తాను మరణిస్తున్నా కొడుకు శ్రీతేజ్‌ను రక్షించుకోవడానికి రేవతి పడ్డ తపన మనం చూశాం. రేవతి అందరి మనసును కరిగేలా చేసింది" హరీష్‌రావు పేర్కొన్నారు.

**గురుకులాల పిల్లలు గుర్తుకు రాలేదా..?**

"ఇక్కడ రాజకీయాలు మాట్లాడే సందర్భం కాదు. ప్రతిపక్షాలపై సీఎం రేవంత్ నెపాన్ని నెడుతున్నపుడు రాజకీయాలు మాట్లాడలేక ఉండని పరిస్థితి. సంధ్య థియేటర్ ఘటన జరిగిన పది రోజులకు సీఎం, మంత్రులు స్పందించారు. గురుకులాల్లో చనిపోతున్న పిల్లల కుటుంబాలను రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గం ఎందుకు పరామర్శించలేదు. గురుకులాల పిల్లల మాతృ మూర్తుల శోకాన్ని సీఎం ఎందుకు గుర్తించడం లేదు. చట్టం అందరికీ సమానమే అంటున్న సీఎం రేవంత్ కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయి రెడ్డి ఆత్మహత్యకు కారణమైన వారిని ఇంతవరకు ఎందుకు అరెస్ట్ చేయలేదు. సాయిరెడ్డి రాసిన ఆత్మహత్య లేఖలో ఉన్న తన సోదరులపై రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోరు?. రేవంత్ రెడ్డి సోదరులను కనీసం పోలీస్ స్టేషన్‌కు కూడా పిలవరా?. సినీ ఇండస్ట్రీ రాష్ట్ర ప్రభుత్వం చర్చల గురించి రాష్ట్ర ప్రజలు ఏమనుకుంటున్నారో అందరికీ తెలుసు.. ప్రేమానురాగాలతో మనసులు గెలవాలి కానీ భయాందోళనలు సృష్టించి కాదు. రాష్ట్రానికి మంచి జరిగితే అందరం హర్షించాలి" అని హరీష్‌రావు

## నేటి నుంచి సీఎం కప్

తరువాయి భాగం

సంబంధించిన రాష్ట్రస్థాయి పోటీలు నేటి నుంచి జనవరి 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పోటీలకు ఏర్పాట్లు చేశారు. మట్టిలో మాణిక్యాలను గుర్తించి వారి ప్రతిభకు ప్రోత్సాహం కల్పించాలన్న ఆశయంతో పాటు పల్లెల నుంచి ప్రపంచ ఛాంపియన్లను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ 2024 క్రీడా పోటీలను నిర్వహిస్తుంది. గ్రామస్థాయి, మండల, జిల్లా స్థాయి పోటీలు పూర్తి కాగా.. డిసెంబర్ 27 నుండి జనవరి 2 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయి. పండుగ వాతావరణంలో జరుగనున్నాయని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా దాదాపు రెండు లక్షల మందికి పైగా క్రీడాకారుల సమాచారాన్ని గేమ్స్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా సంక్షిప్తం చేశారని, క్రీడాకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలు అందజేయడం, క్రీడలకు ఆధునిక సాంకేతిక హంగులు సమకూర్చడం, రాబోయే తరానికి దిక్సూచిలా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోందని, ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు.

## మాజీ ఎంపీ మందా జగన్నాథంకు సీరియస్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం ఆయనకు గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్ కు తరలించారు. దీంతో వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. చికిత్సకు ఆయన స్పందించడం లేదని తెలుస్తోంది. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల ముఖ్య నేతలు ఆయనను పరామర్శిస్తున్నారు. బీఆర్ఎ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యేలు బండారు లక్ష్మారెడ్డి, వివేకానంద గౌడ్, మాజీ మంత్రులు దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు జగన్నాథంను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జగన్నాథం త్వరలో కోలుకుని ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# అవిశ్రాంత యోధుడు..

తరువాయి భాగం

తన ఇంట్లో మన్మోహన్ సింగ్ స్పృహ కోల్పోయారని, వెంటనే ఆయన్ను రక్షించేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆ ప్రకటనలో తెలిపారు. రాత్రి 8.06గంటల ప్రాంతంలో ఆయన్ను ఎయిమ్స్‌లోని అత్యవసర సేవల విభాగానికి తీసుకొచ్చారని, వెంటనే చికిత్స అందిస్తూ ఆయన్ను రక్షించేందుకు అన్ని ప్రయత్నాలూ చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని తెలిపారు.

**పంజాబ్‌లో పుట్టి, కేంబ్రిడ్జిలో చదివి..**

ప్రస్తుత పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో 1932లో మన్మోహన్‌సింగ్ జన్మించారు. పంజాబ్ యూనిర్సిటీలో విద్యాభ్యాసం పూర్తయ్యాక కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ పూర్తిచేశారు. మన్మోహన్ సింగ్ 2004 నుంచి 2014 వరకు రెండు పర్యాయాలు భారత ప్రధానిగా పనిచేశారు. 2004 లోక్ సభ ఎన్నికల్లో అటల్ బిహారీ వాజ్ పేయి నేతృత్వంలోని ఎన్డీయేపై కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత ఆయన తొలిసారిగా 2004లో ప్రమాణ స్వీకారం చేశారు. 2009 నుంచి 2014 వరకు రెండోసారి పదవిలో కొనసాగారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో 19911996 మధ్య మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రిగా పనిచేశారు.

**33 ఏళ్లు ఎంపీగా సేవలు..**

మృదు స్వభావి అయిన మన్మోహన్ సింగ్.. ఉన్నత విద్యావంతుడు, ప్రఖ్యాత ఆర్థికవేత్త. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని గట్టెక్కించి అభివృద్ధిపథంలో పరుగులు పెట్టేలా చేసి ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా ప్రసిద్ధిగాంచారు. పార్లమెంటు సభ్యుడిగా దాదాపు 33 ఏళ్ల పాటు కొనసాగారు. ఆరోగ్యం సహకరించని పరిస్థితుల్లోనూ కీలక సమయాల్లో ఓపిగ్గా సభకు వచ్చి అందరిలోనూ స్ఫూర్తి నింపారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి, ప్రజా జీవితం నుంచి నిశ్శబ్దంగానే వైదొలగినప్పటికీ దేశ ఆర్థిక రంగానికి వేసిన బలమైన పునాదులు ఆయనను ఎన్నటికీ గుర్తు చేస్తూనే ఉంటాయి. ఆర్థిక మంత్రిగా ఎల్‌పీజీ సంస్కరణలు ప్రవేశ పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది.

**ప్రధాని పదవి చేపట్టిన తొలి హిందూయేతర వ్యక్తిగా రికార్డు..**

ప్రధానిగా మన్మోహన్ సింగ్ రోజూ 18గంటల పాటు అవిశ్రాంతంగా పనిచేసేవారు. భారత విత్త వ్యవస్థను అత్యంత శక్తిమంతగా తీర్చిదిద్దారు. దశాబ్ద పాలనలో చిరస్మరణీయ విజయాలను అందుకున్నారు. 2005లో సమాచార హక్కు చట్టం, ఉపాధిహామీ పథకం వంటివి తీసుకొచ్చారు. ఆయన హయాంలో అత్యధిక జీడీపీ (10.8శాతం) వృద్ధిరేటు నమోదైంది. మన్మోహన్ హయాంలోనే వెనుకబడిన వర్గాలకు 27శాతం సీట్లు కేటాయించారు. ప్రధాని పీఠాన్ని అధిష్ఠించిన తొలి హిందూయేతర వ్యక్తిగానూ రికార్డు సాధించారు.

**దేశం గొప్ప నేతను కోల్పోయింది:మోడీ**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం తెలిపారు ప్రధాని మోదీ. భారతదేశం తన అత్యంత విశిష్ట నాయకులలో ఒకరైన డాక్టర్ మన్మోహన్ సింగ్ జీ ని కోల్పోయినందుకు సంతాపం వ్యక్తం చేస్తుందన్నారు. నిరాడంబరమైన మూలాల నుండి ఎదిగి, గౌరవనీయమైన ఆర్థికవేత్తగా మన్మోహన్ ఎదిగారని ప్రధాని మోదీ కితాబిచ్చారు. "ఆర్థిక మంత్రిగా సహా వివిధ ప్రభుత్వ పదవులలో పనిచేశారు. దేశ ఆర్థిక విధానంపై బలమైన ముద్ర వేశారు. పార్లమెంట్‌లో ఆయన చేసిన ప్రసంగాలు అద్భుతమైనవి. భారత ప్రధానిగా ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ఆయన విస్తృతంగా కృషి చేశారు" అని ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారు.

**దూరదృష్టి గల రాజనీతిజ్ఞుడు:ఖర్గే**

"మాజీ ప్రధాని మరణంతో, భారతదేశం దూరదృష్టిగల రాజనీతిజ్ఞుడిని, అభిశంసించలేని సమగ్రత కలిగిన నాయకుడిని ఆర్థికవేత్తను కోల్పోయింది. ఆర్థిక సరళీకరణ హక్కుల ఆధారిత సంక్షేమ నమూనా అనే ఆయన విధానం కోట్లాది మంది భారతీయుల జీవితాలను మార్చివేసింది. భారతదేశంలో మధ్య తరగతిని సృష్టించి, కోట్లాది మందిని పేదరికం నుండి బయటవేశారు. అచంచలమైన అంకితభావంతో ఉన్నత స్థాయికి ఎదిగి, భారతదేశ ఆకాంక్షలను సాకారం చేసిన జీవితకాల సీనియర్ సహోద్యోగిని, సున్నిత మేధావి, వినయపూర్వకమైన వ్యక్తిని కోల్పోయినందుకు నేను సంతాపం వ్యక్తం చేస్తున్నాను. కార్మిక మంత్రిగా, రైల్వే మంత్రిగా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా ఆయన కేబినెట్‌లో భాగమైనందుకు గర్విస్తున్నా. మాటల కంటే క్రియాత్మకమైన వ్యక్తి. దేశ నిర్మాణానికి ఆయన చేసిన అపారమైన కృషి భారతీయ చరిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది".

**నా మార్గదర్శిని కోల్పోయాను: రాహుల్ గాంధీ**

కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల లోక్ సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మన్మోహన్ మృతితో తాను ఒక గురువును, మార్గదర్శిని కోల్పోయానంటూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో మన్మోహన్ సింగ్ అర్ధాంగికి, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసుకుంటున్నానని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా దేశాన్ని విశేష పరిజ్ఞానం, సమగ్రతతో నడిపించారని కొనియాడారు. ఆయన మృదు స్వభావం, ఆర్థికశాస్త్రంపై ఆయన లోతైన అవగాహన జాతికి స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. కోట్లాది మంది అభిమానులు ఆయనను అత్యంత గర్వంగా గుర్తుంచుకుంటారని తెలిపారు.



**గొప్ప మానవతావాదిని కోల్పోయాం: సీఎం రేవంత్**

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. "గొప్ప ఆర్థికవేత్తల్లో ఒకరు, నాయకులు, సంస్కర్త, అన్నింటికంటే మించి మన కాలంలోని మానవతావాది మన్మోహన్ సింగ్ జీ ఇక లేరు. సద్గుణం, నిష్కళంకమైన సమగ్రత, నిర్ణయం తీసుకోవడంలో అన్నింటికంటే మానవీయతో చూసే వ్యక్తి. డాక్టర్ సింగ్ న్యూ ఇండియాకు నిజమైన వాస్తుశిల్పుల్లో ఒకరు. రాజకీయ & ప్రజా జీవితానికి మర్యాద ఎంత అవసరమో చూపించారు. ఆయన ఒక లెజెండ్, ఆయన మరణం భారత దేశం ఒక గొప్ప కుమారుడిని కోల్పోయింది." అని అన్నారు.

**మన్మోహన్ హయాంలోనే తెలంగాణ ఏర్పాటు: కేసీఆర్**


'భారతదేశం ఆర్థికంగా క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలు చేయడం లో ఆర్థిక రంగ నిపుణుడుగా తన విద్వత్తును మన్మోహన్ సింగ్ ప్రదర్శించారు' అని మాజీ సీఎం కేసీఆర్ కొనియాడారు. పీవీ మనసు గెలిచిన మన్మోహన్ సింగ్ అనేక ఉన్నత శిఖరాలకు చేరుకున్న భరతమాత ముద్దు బిడ్డ అని శ్లాఘించారు. భారత ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగడం చారిత్రక సందర్భం అని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ గుర్తుచేశారు.

## జనగణనలోనే కులగణన..

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

జనగణనలో కుల గణన చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కుల గణనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. బెళగావిలో గురువారం జరిగిన సీడబ్ల్యూసీ సదస్సులో సీఎం రేవంత్ ప్రసంగించారు. కులగణన చేపట్టడం ద్వారా తెలంగాణ దేశానికే మార్గదర్శిగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో కులగణన కూడా చేపట్టాలని.. ఈ విషయపై కాంగ్రెస్ పోరాటం చేయాలన్నారు. ఈ విషయంలో సీడబ్ల్యూసీ ఒక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ ప్రతిపాదనకు సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

త్వరలో చేపట్టనున్న నియోజకవర్గాల పునర్విభజనలోనూ ఏఐసీసీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో ఏఐసీసీ వ్యూహాత్మకంగా వ్యవహరించి... అత్యంత జాగ్రత్తగా ముందడుగు వేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టిన మహిళా బిల్లు కొలిక్కి వచ్చిన నేపథ్యంలో దానిపై కాంగ్రెస్ పార్టీనే ఎక్కువగా ప్రచారం చేయాల్సి ఉందని రేవంత్ రెడ్డి సూచించారు. మహిళా బిల్లు విషయంలోనూ బీజేపీ రిజర్వేషన్లను తనకు అనుకూలంగా చేసుకునే అవకాశాలున్నందున కాంగ్రెస్ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని వ్యాఖ్యానించారు.



**బీజేపీ కుటిల రాజకీయాలు: మహేశ్ గౌడ్**

రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు కులగణనతో దేశంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. దీన్ని దేశమంతా స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. కులాల పేరిట, మతాల పేరిట రాజకీయాలు చేస్తూ దేశాన్ని విభజించి పాలిస్తూ రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్న బీజేపీ కుటిల రాజకీయ ఎత్తుగడలకు కులగణన చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. కులగణనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి దానిని ప్రారంభించడం ద్వారా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందని మహేశ్ కుమార్ చెప్పారు.

## ఎన్నికల సంఘంపై ప్రజలకు నమ్మకం పోతోంది

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

న్నికల సంఘం నిష్పాక్షికతపై సందేహాలు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆరోపించారు. మోదీ సర్కారు వైఖర అందుకు కారణమన్న ఆయన, రాజ్యాంగ సంస్థలన్నింటినీ తన గుప్పెట్లో పెట్టుకునేందుకు యత్నిస్తోందని విమర్శించారు. జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీ సిద్ధాంతాలు, బీఆర్ అంబేద్కర్ గౌరవం కోస చివరి శ్వాస వరకు కాంగ్రెస్ పోరాడుతుందని గురువారం బెళగావిలో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశంలో స్పష్టం చేశారు. త్వరలోనే పార్టీ పదవులన్నింటినీ భర్తీ చేస్తామని ప్రకటించారు.

మహాత్మాగాంధీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి అయిన వర్కింగ్ కమిటీ కర్ణాటక బెళగావిలో ప్రత్యేకంగా సమావేశమైంది. బెళగావిలో జరిగిన కార్యక్రమంలోనే మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించగా అదేచోట నవ సత్యాగ్రహ బైఠక్ పేరుతో తాజా సమావేశాన్ని ఆ పార్టీ అధినాయకత్వం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. అనారోగ్యం కారణంగా సోనియా గాంధీ ఈ సమావేశానికి రాలేదు. వీడియో రూపంలో తన సందేశాన్ని పంపారు. వచ్చే ఏడాది రాజకీయంగా, ఎన్నికల పరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమాలోచనలు జరిపింది.

సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఉద్దేశించి ప్రారంభ ఉపన్యాసం చేసిన ఖర్గే రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడినప్పటికీ ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం తప్పును ఒప్పుకునే స్థితిలో లేరని విమర్శించారు.

## గ్రూప్–1 ఫలితాలకు గ్రీన్‌సిగ్నల్

### పిటిషన్లన్నింటినీ కొట్టివేసిన హైకోర్టు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్1 పరీక్షపై అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లతో పాటు పలు అంశాలపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్లు తేలేంత వరకు గ్రూప్1 ఫలితాలు ప్రకటించొద్దని కోర్టుకు అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తూ పలు పిటిషన్లు దాఖలు చేశారు. ఫలితాలు నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన కోర్టు.. ఫలితాలు నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది మార్చి నాటికి గ్రూప్1 ఫలితాలు ప్రకటిస్తామని ఇటీవలే టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం ప్రకటించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
27.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి జన్మది-నం సందర్భంగా ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభా-కాంక్షలు తెలియచేసిన గడ్డి అన్నారం వ్యవ-సాయ మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధు-సూదన్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థి అదృశ్యం



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్ నగర్ కు చెందిన గంట అరవింద్ రెడ్డి తండ్రి గంట రాజశేఖర్ రెడ్డి, వయసు 19 సంవత్సరాలు, బిటెక్ ఫస్ట్ ఇయర్ బుధవారం రాత్రి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అరవింద రెడ్డి గత కొన్ని రోజులుగా రోజు బాగా ఫోన్ మాట్లాడుతున్నాడని, ఫోన్లో ఎక్కువగా చాటింగ్ చేస్తున్నాడని, బయట ఎక్కువగా తిరుగుతున్నాడని ఇంట్లో మదలించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దాంతో ఆయన తండ్రి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నాగరాజు తెలియజేశారు.





# వైభవంగా అయ్యప్ప మహా ఊరేగింపు

- **పంచవాయిద్యాలు, శరణఘోషతో మారుమ్రోగిన బెల్**
- **అంభారీ అధిరోహించి భక్తులను అనుగ్రహించిన భక్తవత్సలుడు**

**పటాన్ చెరు(రామచంద్రాపురం), విశాల భారతి**

ప్రతీ సంవత్సరం డిసెంబరు 25న మండల పూజను పురస్కరించుకుని బీహెచ్ఈఎల్ లో నిర్వహించే అయ్యప్ప మహా ఊరేగింపు ఈ ఏడాది కూడా కన్నుల పండువగా సాగింది. అంబారిని ఎక్కి ఆదిదేవుడు కదిలిరాగా, పంచవాయిద్యాలు, కావడియట్టం నృత్యాలు, శరణుఘోషలతో బెల్ టౌన్ షిప్ భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. సాంప్రదాయ బద్ధంగా బెల్ టౌన్ షిప్ లోని శ్రీనివాస థియేటర్ వద్ద నుంచి ఊరేగింపు బుధవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైంది. అందంగా అలంకరించిన అంబారీపై అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్ అయ్యప్ప దేవాలయ గురుస్వామి పరమేశ్వరన్ పిళ్లైగురుస్వామి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఊరేగింపు పంచవాయిద్యాల నడుమ భజనలు, శరణుఘోషలతో ముందుకు సాగింది. అయ్యప్ప ఊరేగింపు అగ్ర భాగాన చిన్నారులు మంగళహారతులు పట్టుకుని ముందుకు కదిలారు. కావడిలను ధరించిన అయ్యప్ప భక్తులు పంచవాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేస్తూ భక్తి పారశ్యంలో మునిగిపోయారు. మరోవైపు హరిహరపుత్రుడైన అయ్యప్పను కీర్తిస్తూ కొనసాగిన భజనలు భక్తులను ఆనందపరవశులను చేశాయి. అయ్యప్ప ఊరేగింపు బెల్ టౌన్ షిప్ ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చింది.



వేలాదిగా తరలివచ్చిన భక్తులు అయ్యప్ప శరణుఘోష చేస్తూ స్వామియే శరణం అంటూ ఊరేగింపులో బాగమయ్యారు. ఊరేగింపు అనంతరం రాత్రి అయ్యప్ప దేవాలయంలో పరముశ్వరన్ పిళ్లై గురుస్వామి మహాపడిని వెలిగించడంతో ఊరేగింపు ముగిసింది. ఈ కార్యక్రమంలో బెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.బి. రాజా, అయ్యప్ప ఆలయ కమిటి అధ్యక్షులు ఎం.పి.వి.రమణ, అధికారులు, అయ్యప్ప దేవాలయ కమిటి సభ్యులు, గురుస్వాములు, మాలదారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకలకు హాజరైన మంత్రి కోమటిరెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ 4వ వార్డ్ కౌన్సిలర్ వద్దేపల్లి విద్యా విజేందర్ రెడ్డి దంపతుల కుమారుడు, కుమార్తెల నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకలు విఆర్ సి కన్వెన్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని చిన్నారులు అక్షజ్ రెడ్డి, సమీక్ష రెడ్డిలను ఆశీర్వదించారు.

## బీసీలంటే బీజేపీకి ఇష్టం లేదా..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీసీ కులగణనపై తమ వైఖరి ఏంటో బీజేపీ పార్టీ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలు, కామారెడ్డి డిక్లరేషన్ అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. బీసీలంటే బీజేపీకి లెక్కలేదా అని అడిగారు. గురువారం నాడు కుమ్మరి సంఘం నేతలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తన నివాసంలో కలిశారు. బీసీలు, ముఖ్యంగా కులవృత్తుల వారు ఎదుర్కొంటున్న సమస్యలను వారు ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని స్పష్టం చేశారు. కేసీఆర్ కులవృత్తులకు అన్ని విధాలా మద్ధతిచ్చారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కులవృత్తులను కుదేలు చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా బీసీల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు.

## డొనేషన్లలో బీఆర్ఎస్ టాప్

**తరువాయి భాగం**

ఇప్పుడు ఆ పార్టీని కిందకు నెట్టేసి కేసీఆర్ నాయకత్వంలోని పార్టీ టాప్ ప్లేసుకు వచ్చింది. లోక్‌సభ ఎన్నికల ప్రారంభం నాటికి ఆ పార్టీ ఖాతాలో రూ.1,519 కోట్లు ఉన్నాయి. ఎన్నికల ప్రకటన వచ్చినప్పటి నుంచి ముగిసేలోపు బీఆర్ఎస్ పార్టీకి రూ.47.56 కోట్ల విరాళాలు వచ్చాయి. ఎన్నికల ఏడాదిలో బీజేపీ విరాళాల పంట పండించుకుంది. ఆ పార్టీకి 202324లో ఏకంగా రూ. 2.244 కోట్లు విరాళాలు వచ్చాయి. ఈ విషయాన్ని ఈసీకి ఆ పార్టీ చెప్పింది. స్వతంత్ర భారతావనిలో ఒకే పార్టీకి ఇంత పెద్ద మొత్తంలో విరాళాలు రావడం ఇదే మొదటి సారి. అంతకు ముందు ఏడాది బీజేపీకి వచ్చింది రూ. 700 కోట్లు మాత్రమే. దేశంలో బీజేపీ కి పోటీగా ఉన్న ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ కు అందులో పది శాతం మాత్రమే వచ్చాయి. 289 కోట్ల రూపాయలు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి వచ్చాయి. అయితే గత ఏడాదితో పోలిస్తే ఇవి చాలా ఎక్కువే. అంతకు ముందు ఏడాది కేవలం డెబ్బై కోట్ల విరాళాలు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి వచ్చిన దాని కన్నా బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన విరాళాలు చాలా ఎక్కువ. ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేసిన తర్వాత రాజకీయ పార్టీలుతమ వార్షిక విరాళాల వివరాలను ఈసీకి సమర్పించాయి. ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా పారిశ్రామిక వేత్తలు విరాళాలు ఇస్తున్నారు. ఈ ట్రస్టు నుంచి బీజేపీకి రూ.723.6 కోట్లు రాగా, కాంగ్రెస్ కు రూ.156.4 కోట్లు విరాళంగా ఇచ్చారు. మొత్తం విరాళాల్లో మూడింట ఒక వంతు బీజేపీకి దక్కాయి.



రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల పరిధిలోని పులుగు గూడెం గ్రామంలో ఇటీవల మరణించిన ఎర్ర గణేష్ దశ దిన కార్యక్రమంలో భువనగిరి పార్లిమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి**





# పోరాటయోధుడు కామ్రేడ్ కేవల్ కిషన్

- **కేవల్ కిషన్ పోరాటం నేటి తరానికి స్ఫూర్తి**
- **కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్**

**పటాన్ చెరు(చెగుంట),విశాలభారతి**

పేదల సంక్షేమం కోసం పరితపించిన పోరాట యోధుడు కామ్రేడ్ కేవల్ కిషన్ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు అన్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో స్వర్గీయ కేవల్ కిషన్ ముదిరాజ్ స్మారకర్తము ఆయన సమాధి వద్ద ప్రతి సంవత్సరం నిర్వహించే జాతరలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీ శుభాష్ రెడ్డి, తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, కెవల్ కిషన్ కూతురు డాక్టర్ వీణ కుమారితో కలిసి నీలం మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సమాధి వద్ద నివాళులు అర్పించారు. నీలం మధు మాట్లాడుతూ నిరంతరం ప్రజల హక్కుల కోసం పోరాటం చేసి ప్రజల కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు కేవల్ కిషన్ అన్నారు. మెదక్ ప్రాంతంలోని జమిందారుల ఆగడాలతో విసిగి వేసారిన పేదలను ఒక్కటి చేసి ప్రజాపోరాటాలు నిర్వహించారని తెలిపారు. దున్నేవాడికే భూమి అంటు భూ పోరాటాలు చేసి పేదలకు భూములు పంచిపెట్టారని కొనియాడారు. అలాగే కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసి హక్కుల సాధనకు కృషి చేశాడన్నారు. అలాంటి మహనీయున్ని ప్రజలు స్మరించుకుంటు ఆయన వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి చుట్టూ ఎడ్లబండ్లను తిప్పుతూ జాతరను చేయడం ప్రశంసనీయమని తెలిపారు. ప్రజల కోసం జీవించి ప్రాణాలర్పించిన మహనీయులని ప్రజలు తమ గుండెల్లో పెట్టుకొని కొలుస్తారనడానికి నిదర్శనమే కెవల్ కిషన్ పోరాటం అన్నారు. అలాంటి మహనీయుని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు పుట్టి అక్షయ్, మాజీ సర్పంచ్ సత్యం, స్వరూప, సత్యనారాయణ, గోపాలకృష్ణ, శ్రీకాంత్, శివన్న, బోయిని అరుణ, హెచ్సీయు శివ, ఓయు సంతోష్, జలిగారి ఎట్టయ్య, సుంకరబోయిన మహేష్, నారబోయిన శ్రీనివాస్, పిల్లుట్ల గంగాధర్, సదుల్నగర్ కృష్ణ, సత్యం, మణిదీప్, తలారి భిక్షపతి, ఉత్సవ నిర్వాహకులు, తధితరులు పాల్గొన్నారు.

## ఎర్రోళ్ల అరెస్ట్, బెయిల్

- **విచారణకు సహకరించాలన్న న్యాయస్థానం**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. పోలీసుల విధులను అడ్డుకున్నారని శ్రీనివాస్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇప్పటికే నాంపల్లి పోలీసులు ఆయన్ను 3 సార్లు విచారణకు పిలిచారు. విచారణకు రాకపోవడంతో గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. వాదనలు విన్న కోర్టు.. శ్రీనివాస్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.5వేల పూచీకత్తుతో పాటు ఇద్దరు ష్యూరిటీలు సమర్పించాలని, పోలీసుల విచారణకు సహకరించాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. అంతకు ముందు భారాస నేతలు హరీశ్‌రావు, వివేక్, ఎర్రబెల్లి దయాకర్‌రావు మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్‌లో ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కలిసి పరామర్శించారు. శ్రీనివాస్‌ను కోర్టుకు తరలించే క్రమంలో పోలీసు వాహనాన్ని భారాస విద్యార్థి నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు.



# సోషలిజమే దేశానికి ప్రత్యామ్నాయం

- సిపిఐ కార్యదర్శి రామకృష్ణ

శేరిలింగంపల్లి-విశాల భారతి

భారత దేశంలో అందరికీ సమాన హక్కులు సమసమాజం రావాలంటే సోషలిజమే ప్రత్యామ్నాయమని ఆ పార్టీ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ అన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల వేడుకలు సిపిఐ కార్యాలయంలో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు.భారత సరిహద్దు రేఖల్లో చైనా, నేపాల్ అలాగే శ్రీలంక దేశాలలో కమ్యూనిస్టు ప్రభుత్వాలు అభివృద్ధిలో మనకన్న ముందున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాల ఆలోచనతో అగ్రభాగాన చేరాయి అన్నారు.నేడు భారత్ లో ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోయి పేదవాడు మరింత పేదగా,ధనికుడు అత్యంత కుబేరులుగా మారుతున్నారని దానికి కారణం బూర్జువా పార్టీలేదేనన్నారు .ఈ పరిస్థితిని నివారించి ఈ ఉత్తమమైన పరిష్కార మార్గం చూపేది సోషలిస్ట్ పార్టీలేనని తెలిపారు.కమ్యూనిస్టు పోరాటాల ద్వారా ఈ దేశంలో సోషలిజం సాధనయే ధ్యేయంగా రాజీలేని ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.దేశ స్వాతంత్ర, తెలంగాణ సాయుధ పోరాటంలో అనేకమంది కమ్యూనిస్టులు అమరులయ్యారని సిద్ధాంతాలకు కట్టుబడి దేశం కోసం త్యాగాలు చేసిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదే అని కొనియాడారు.దోపిడీ లేని సమాజం కావాలని పోరాడుతూ ఇల్లు లేని పేదలకు ఇండ్ల కోసం భూమిలేని పేదలకు భూమి కోసం కార్మికుల హక్కుల కోసం రైతు కూలీల సమస్యలపై,బడుగు బలహీన వర్గాల కోసం ప్రజాస్వామ్యం కోసం ఈ దేశంలో విప్లవం జయప్రదం కోసం ఎర్ర జెండా నాయకత్వం లో పోరాటాలు అనేకంగా నిర్వహించామన్నారు.ఎర్ర జెండాలే ఈ దేశానికి ప్రత్యామ్నాయం సోషలిజమే ఈ దేశానికి సురక్షితమని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలో వలస వచ్చినా కార్మికులకు ఇంటి స్థలాలకై ఎన్నో పోరాటాలు నిర్వహించి ఎన్నో బస్తీలను నెలకొల్పిన ఘనత సిపిఐ పార్టీకి దక్కిందన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలకై పోరాటాలకు సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ డి హెచ్పిఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కే.వెంకటస్వామి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కే చందు యాదవ్,ప్రజానాట్య మండలికి కాశీ,సుధాకర్,జెట్టి శ్రీనివాస్,ఎస్ కొండలయ్య, శివకుమార్,లక్ష్మి,నితీసి,ధర్మ తేజ, మల్లెల దేవేందర్ యాదవ్,అశోక్ దాసు తదితరులు పాల్గొన్నారు.


విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
27.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

బాల్కొండ,విశాలభారతి



అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని మోర్తాడ్ పోలీసులు పట్టుకున్నారు.ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా మోర్తాడ్ గ్రామం నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ(టిఎస్ 18టి 8887)ని అలాగే డ్రైవర్ సందీప్ పండార్ ను పట్టుకొని తదుపరి చర్యలకు రెవెన్యూ డిపార్ట్మెంట్ అధికారులకు అప్పగించడం జరిగిందని ఓ ప్రకటనలో తెలిపారు.





# గ్రామాల అభివృద్ధికి పరిశ్రమల సహకారం అభినందనీయం


- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రుద్రారంలో ఒక కోటి 68 లక్షల రూపాయల అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

పటాన్ చెరు,విశాలభారతి


గ్రామాల అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వాములు కావడం అభినందనీయమని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలో తోషిబా పరిశ్రమ సహకారంతో కోటి 8 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన పల్లె దవఖాన భవనం, మూడు ఆరో ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. అనంతరం 60 లక్షల రూపాయల గ్రామపంచాయతీ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రతి పల్లె దవాఖానాలో వైద్యుడు తో పాటు ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రుద్రారం గ్రామ అభివృద్ధికి తోషిబా సంస్థ సహకారం అందించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండు, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు హరి ప్రసాద్ రెడ్డి, రాజు, వెంకన్న, తోషిబా సంస్థ ప్రతినిధి రామకృష్ణ, గ్రామ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్ ట్రాఫిక్ డిసిపి గా సాయి మనోహర్

శేరిలింగంపల్లి,విశాలభారతి:



మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ గా డిసెంబర్ 16 న పదోన్నతి పొందిన సాయి మనోహర్ గురువారం తన బాధ్యతలు స్వీకరించారు. 1996లో పోలీస్ శాఖలో సబ్ ఇన్స్ పెక్టర్ గా విధుల్లో చేరిన సాయి మనోహర్ అంచెలంచెలుగా ఎదుగుతూ పదోన్నతులు పొందుతూ డిసిపి స్థాయికి చేరుకున్నారు.సైబరాబాద్ లిమిట్స్ లో కీలక ప్రాంతమైన మాదాపూర్ జోన్ ట్రాఫిక్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ గా డిసెంబర్ 16 న పోలీస్ శాఖ నియమించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో బాధ్యతలను స్వీకరించారు ఈ సందర్భంగా సాయి మనోహర్ మాట్లాడుతూ మాదాపూర్ జోన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తానని రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని అన్నారు. డిసిపి గా బాధ్యతలు స్వీకరించిన సాయి మనోహర్ కు పోలీస్ అధికారులు,సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.




# టిబిఈఎస్ఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

సూర్యాపేట, విశాల భారతి

తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పాతులోతు ధారాసింగ్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా డి రఘునాయక్, కోశాధికారిగా గుగులోతు హుస్సేన్ నాయక్ లతో పాటు సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులుగా వాంకుడోత్ వెంకన్న నాయక్ ను ఎన్నుకున్నారు. సంఘం మాజీ అధ్యక్షులు మంగత్య నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారిగా రాములు నాయక్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పాతులోతు ధారాసింగ్ నాయక్ మాట్లాడుతూ బంజారా ఉద్యోగులు ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం జారీ చేసిన 342 జీవోను సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ డబ్ల్యూ ఎస్ ను 10 శాతం కోటాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అన్ని శాఖల్లోని బంజారా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండాలని కోరారు. అనంతరం తమ నియామకానికి సహకరించిన సంఘం నాయకులు, బంజారా ఉద్యోగులకు నూతన కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి బాలోజీ నాయక్, డి లాలూ నాయక్, జి మోతిలాల్, బి పాండు, డి తావూరియా, జి.రమేష్, డి రఘుపతి నాయక్, వినోద్, హౌసింగ్, రామ్ సింగ్, లావుడ్య చందూలాల్ నాయక్, లింగ నాయక్, రవీందర్ నాయక్ పాల్గొన్నారు.






# తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు

- జక్కిడి శివ చరణ్ రెడ్డికి ఘన స్వాగతం

ఎల్బీనగర్ విశాల భారతి:

రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో 2 లక్షల 16 వేయిల 115 ఓట్ల మెజారిటితో ఘన విజయం సాధించి రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికై, గురువారము నాడు ఢిల్లీ నుండి హైదరాబాద్ కి విచ్చేసిన జక్కిడి శివ చరణ్ రెడ్డికి శంషాబాద్ రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికి వందలాది కార్లతో శంషాబాద్ రాజీవ్ గాంధీ విమానాశ్రయం నుండి ఎల్బీనగర్ జక్కిడి శివ చరణ్ రెడ్డి నివాసం వరకు భారీ ర్యాలీ నిర్వహించిన యువజన కాంగ్రెస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు.

# ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



శేరిలింగంపల్లి-విశాల భారతి

మాదాపూర్ ఆర్య వైశ్య సంఘం నూతన ఆంగ్ల సంవత్సరం 2025 క్యాలెండర్ ను ఎర్రగుడ్ల శ్రీనివాస్ తో కలిసి పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గురువారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం మాదాపూర్ అధ్యక్షులు బాలరాజు,ప్రధాన కార్యదర్శి కొండూరు మురళి, కోశాధికారి దొడ్ల సుధాకర్, వ్యవస్థాపకులు ట్రస్ట్ సభ్యులు కొత్త అశోక్ కుమార్, గోలిరాజు,బాదం భాస్కర్, బాదం శర్వాలింగం, సిద్దిలింగం,రాజేందర్, శివ రామకృష్ణ, వైఎస్ మూర్తి, దర్శి శ్రీనివాస్,సాయి బాబా చిన్న పరమేశ్,నరేష్,తల్లెం నాగరాజు,మారం నరేష్, అరవింద్ కుమార్ ,రామారావు మధు సుధన్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రాజీలేని పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టులే

- సీపీఐ శత జయంతి వార్షికోత్సవాలు
- వి.ఎస్. బోస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

నాచారం, విశాలభారతి:

నిస్వార్థంగా అధికారకాంక్ష లేకుండా ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టులేనని భారత కమ్యూనిస్టు పార్టీ( సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్ పిలుపునిచ్చారు. సీపీఐ శత జయంతి వార్షికోత్సవాల సందర్భంగా మల్లాపూర్ సీపీఐ సమితి ఆధ్వర్యంలో నూతన కూడలి వద్ద ఎర్రజెండాను బోస్ ఎగురవేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్ మాట్లాడుతూ సీపీఐ స్థాపన జరిగి వంద సంవత్సరాలైందని, జరిగిన కాలమంతా పోరాటాలు, త్యాగాల చరిత్రేనని వారు అన్నారు. దేశం కోసం, ప్రజల కోసం గొప్ప పోరాటాలు చేసిందని, మనదేశ విముక్తి కోసం స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐ పాల్గొన్నదని వారు గుర్తు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టు రక్తం, స్వేదం చిందించిన తరువాతనే మనం పురోగతి సాధించామన్నారు. భారతదేశ చరిత్రలో 1925 డిసెంబరు 26న సీపీఐ స్థాపన గొప్ప సంఘటనగా నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు పి.లక్ష్మీనారాయణ,నారా నర్సింహా, భిక్షపతి, నర్సింగ్ రావు, టి. మల్కయ్య, అక్బర్..ఏ ఐ ఎస్ ఎఫ్, ఏ ఐ వై ఎఫ్ నేతలు అజీమ్ పాషా, ఇర్ఫాన్, గిరి బాబు, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శేరిలింగంపల్లి,విశాలభారతి:



బృందావన్ కాలనీ ఫీడర్ 33/11 కెవి హెచ్ఎంటి హిల్స్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ మేరకు ఏఈ మాట్లాడుతూ నిజాంపేట్ రోడ్, బృందావన్ కాలనీ,సద్గురు అపార్ట్మెంట్స్, గ్రీన్ హౌస్ అపార్ట్మెంట్స్, ప్రగతి అపార్ట్మెంట్స్, కొలను రాఘవరెడ్డి ఫంక్షన్ హాల్ ఏరియా, ఎస్ఎల్ఎన్ఆర్ అపార్ట్మెంట్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.అందుకు వినియోదారులు సహకరించాలని కోరారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
27.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
5
vishalabharathi Telugu Daily

# GENERAL NEWS

## డిస్ట్రిబ్యూటరీ కేనాల్స్ ద్వారా ఎర్గట్ల మండల చెరువులు నింపాలి

- మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**బాల్కొండ,విశాలభారతి**



ఏర్గట్ల మండలంలో కాకతీయ కెనాల్ నుండి D18,19,20 డిస్ట్రిబ్యూటరీ కేనాల్స్ ద్వారా చెరువులు నింపాలని సిఈ సుధాకర్ రెడ్డిని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కోరారు.వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఏర్గట్ల గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని కలిసిన రైతుల వినతి మేరకు అక్కడి నుండే సిఈతో ఫోన్ లో ఎమ్మెల్యే మాట్లాడారు... కాకతీయ కెనాల్ ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నది కాబట్టి వారం రోజుల్లో D18,19,20 కేనాల్స్ ద్వారా చెరువులు నింపాలని లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు శిక్ష

**బాల్కొండ, విశాల భారతి**

పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు కోర్టు జైలు శిక్ష విధించడం జరిగిందని మెండోర ఎస్సై జి.నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం మెండోర మండలం దూదిగాం గ్రామానికి చెందిన కుంట బోజన్న (38), తండ్రి లింగన్న అనే వ్యక్తి తాగిన మత్తులో తేది ఆగస్టు 26న గురువారం అర్ధరాత్రి సుమారు 12:30 సమయంలో వరుసగా 14 సార్లు డయల్ 100కి ఫోన్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. అలాగే 108కి ఫోన్ చేసి ఆక్సిడెంట్ అయిందని వారి విధులకు కూడా ఆటంకం కలిగించినందుకు గురువారం ఆర్మూర్ కోర్టు ముందు బోజన్న ను హాజరుపరచగా రెండు రోజుల జైలు శిక్ష విధించిందని తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండు రోజులు జైలు

**బాల్కొండ,విశాలభారతి**



డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి కోర్టు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు బాల్కొండ ఎస్సై బి.నరేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం బాల్కొండ గ్రామానికి చెందిన మహమ్మద్ షఫీ(35),తండ్రి ముక్త్యార్, వృత్తి:ఆటో డ్రైవర్,పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డారు. గురువారం అతడిని ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి మేజిస్ట్రేట్ రెండు రోజులు జైలు శిక్ష విధించారన్నారు.

## శ్రమజీవుల అండ ఎర్రజెండా

- సమస్యలు తీరేవరకు పోరాటాలు, త్యాగాలే కమ్యూనిస్టు నైజం
- దేశంలో వంద సంవత్సరాలు దాటిన ఏకైక పార్టీ సిపిఐ
- మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ
- ఘనంగా 100వ ఆవిర్భావ దినోత్సవం

**డోర్నకల్ విశాల భారతి:**




శ్రమజీవులకు ఎల్లప్పుడూ అండగా నిలిచేది సిపిఐ జెండా అని, భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ వారిని చైతన్యవం తుల్ని చేస్తూ ముందుకు సాగుతుందని సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మార గాని బాలకృష్ణ అన్నారు. గురువారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విశ్రాంతి భవనం వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అరుణ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిపిఐ 1925 ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ ఏర్పడి దేశవ్యాప్తంగా 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జెండా ఆవిష్కరణ చేయడం జరిగిందన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బడుగు బలహీన శ్రామిక కార్మిక వర్గాల హక్కులకై నిరంతరం పోరాటాలను చేస్తూ వారి హక్కుల కోసం ప్రభుత్వాలపై ప్రభుత్వ వీధి విధానాలపై నిరంతరం ఒత్తిడి తెస్తూ పెట్టుబడి వర్గాలు ఒత్తిడి నుండి కార్మికులకు కార్మికులకు రావలసిన హక్కులకు ప్రభుత్వం అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలను నిరంతరం వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా 100 సంవత్సరాల్లోకి అడుగుపెట్టిన ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని ఈ దేశంలో ఈ రాష్ట్రంలో అనేక పార్టీలు వచ్చి అంతరించి పోయినాయి కానీ వంద సంవత్సరాలు అయిన తన మనుగడని నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల హక్కులకై పోరాడే కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఈ దేశంలో బడుగు బలహీన వర్గాల పేదరికం కార్మిక శ్రామికుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూ ఈ భూమి ఉన్నంత కాలం సిపిఐ పార్టీ ఉంటుందని ఉంటుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆవులంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని భవిష్యత్తులో పార్టీని మరింత విస్తరించ చేస్తాం ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్, వీరేందర్,లింగయ్య, రాములు, యాకన్న తదితరులు పాల్గొన్నారు.



## సీపీఐ ( యం.యల్ ) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయండి

**సూర్యాపేటలో గోడపత్రిక ఆవిష్కరణ**

**సూర్యాపేట, విశాలభారతి**

డిసెంబరు 28న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం .డేవిడ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రం ఆవరణలో నిర్వహించిన రెండు విప్లవ పార్టీల విలీనం సభ గోడపత్రికలను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏం. డేవిడ్ కుమార్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు విప్లవ కారులు ప్రజల తరపున పోరాడుతు, ప్రారంభం నుండే విప్లవ పార్టీలు చీలికకు గురవుతున్నాయని, దీనితో ప్రజల్లో అసంతృప్తి కూడా పెరిగిందని అన్నారు. విప్లవ ఉద్యమాలు సన్నగిల్లాయని , విప్లవ కారులు ఆలోచన చేసి ప్రజల్ని చైతన్యవంతం చేస్తూ ఐక్యం కావాల్సిన అవసరం నేడు ఏర్పడిందని అందులో భాగంగానే విప్లవకారుల ఐక్యత, రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ డిసెంబర్ 28న జరుగుతుందని దీనికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సభకు ప్రధాన వక్తగా సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్ సింగ్ ఖట్కర్ హాజరైతారని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ ప్రజల మధ్య ఉన్న సోదర భావాన్ని దెబ్బతీస్తుందన్నారు. గత పదేళ్ల కాలంగా పచ్చి కార్పోరేట్ దోపిడీ విధానాలను అవలంభిస్తూ దేశ సహజ సంపదనంతా దోచిపెట్టిందన్నారు. దేశంలో ఆకలి, అసమానతలు,నిరుద్యోగం, హక్కుల హనన, ప్రశ్నించే వారిని అణిచివేయడం నిత్య కృత్యంగా జరుగుతుందన్నారు. ఇలాంటి కష్ట కాలంలో దేశంలో ఉన్న విప్లవకారులంతా ఐక్యమై ప్రజల తరపున పోరాటం చేయాలన్నారు. నక్సల్ బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ పోరాటాల ప్రేరణతో ఏర్పడిన న్యూడెమోక్రసీ పార్టీకి ప్రజల తరపున పోరాడిన ఘనమైన చరిత్ర ఉందన్నారు. అనేకమంది వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని కాంక్షించారన్నారు. అమరవీరుల ఆశయ సాధనకు రెండు న్యూడెమోక్రసీ పార్టీలు ఐక్యమవుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో విప్లవకారులందరినీ ఐక్యం చేసి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కూనుకుంట్లా సైదులు, ఐఎఫ్ టి యు జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు పుల్లూరు సింహాద్రి, పార్టీ టౌన్ నాయకులు వీరబోయిన రమేష్ ,పెద్దింటి అశోక్ రెడ్డి, దండి ప్రవీణ్, దుర్గయ్య, దూదిపాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## పేకాట స్థావరంపై దాడి

**బాల్కొండ, విశాల భారతి**

పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని భీమ్‌గల్ ఎస్సై జి.మహేష్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం భీమ్‌గల్ మండలం సంతోష్‌నగర్ తండాలో కొందరు వ్యక్తులు మూడు ముక్కల పేకాటను డబ్బులతో బెట్టింగ్ పెట్టి ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకొని,వారి దగ్గర నుండి రూ.18,350, 4 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.




## 'ఎర్రజెండా పోరాటాలకు వందేళ్లు'

- తుర్కయంజాల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

**తుర్కయంజాల్, విశాలభారతి:**

దేశంలో ఎర్రజెండా పోరాటాలకు వందేళ్లు పూర్తి చేసుకోవడం గర్వకారణమని సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. తుర్కయంజాల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.శివకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎర్రజెండాను యాదయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఎర్రజెండాకు ఉందన్నారు. దేశ ప్రజలను ఏకం చేయడంలో కమ్యూనిస్ట్ పార్టీ కీలక భూమిక పోషించిందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ ఎర్ర జెండాను పట్టుకునే రైతులు పోరాడారని గుర్తు చేశారు. ఇవే కాకుండా దేశంలో అనేక కార్మిక, కర్షక పోరాటాలను ఎర్రజెండా నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె. శ్రీను, పల్లపు శివకుమార్, శ్రీకాంత్, వట్టి విజయ, సుందరమ్మ, భాస్కర్, రాములు, నాగేశ్వర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు గండికోట శివ, వివేక్, తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు సేకరణ

- చిన్నారులకు వేం నరేందర్‌రెడ్డి అభినందనలు

**తుర్కయంజాల్, విశాలభారతి:**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పథకానికి విరాళాలు సేకరిస్తున్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ హెవెన్స్ కార్నర్ కి చెందిన చిన్నారులను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అభినందించారు. మాంచెస్టర్ గ్లోబల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న కూరపాటి సూర్య తేజ్ భట్, 6వ తరగతి చదువుతున్న కూరపాటి ధరణి తేజ్ భట్‌ను వేం నరేందర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి, సన్మానించారు. విరాళాలు సేకరించిన అనంతరం త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డికి చిన్నారులు అందజేస్తారని తెలిపారు. గతంలోనూ ఈ చిన్నారులు కేరళలో తుఫాన్లు సంభవించినప్పుడు విరాళాలు సేకరించి ఆ స్కూల్ యాజమాన్యానికి అందించడం జరిగిందని, ప్రతి పౌరుడూ సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని సూచించారు. పిల్లలు చేస్తున్న మంచి పనిని అభినందించి ఆశీర్వదించారు. విద్యార్థులను వెన్నంటి ప్రోత్సాహిస్తున్న తల్లిదండ్రులైన కూరపాటి నరసింహారాజు, గీతాస్రవంతిని ఆయన అభినందించారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన నల్ల శ్రీరాములు

**దేవరుప్పల విశాల భారతి**

పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,నియోజక వర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సి రెడ్డిల ఆదేశాల మేరకు దేవరుప్పుల మండలం,నల్లకుంట గ్రామానికి చెందిన జటోత్ శ్రీను కూతురి వివాహ వేడుకల్లో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట మండల యూత్ అధ్యక్షుడు పులిగిళ్ల వెంకన్న,మండల నాయకులు బానోతు భాస్కర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బానోతు శ్రీను,బానోతు వెంకన్న,బానోతు మహేందర్,సోషల్ మీడియా లోడంగి అశోక్ యాదవ్,మాసంపెల్లి సాత్విక్,గ్రామ నాయకులు,కార్యకర్తలు ,తదితరులున్నారు.



## ముత్తంగి క్రీడా ప్రాంగణం అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామంలో గల క్రీడా ప్రాంగణం అభివృద్ధికి నిధులు కేటాయించబోతున్నట్లు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా విస్తరిస్తున్న ముత్తంగి గ్రామ పరిధిలో క్రీడా ప్రాంగణం ఎంతో ప్రాధాన్యతమైనదిగా పేర్కొన్నారు. పచ్చదనంతో పాటు వివిధ రకాల క్రీడా కోర్టులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మాజీ సర్పంచ్ ఉపేందర్, గడీల శ్రీకాంత్ గౌడ్, సిల్వరి శ్రీనివాస్, మేరాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో రాణించాలి



**ఆమనగల్లు, విశాల భారతి :**
యువత స్వయం ఉపాధిలో రాణించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు కండె సాయి కోరారు. స్వయం ఉపాధితో పట్టణానికి చెందిన వెంకటేష్ గౌడ్ ఏర్పాటు చేసిన టేస్టీ హ్యారీ పూరి ఫ్రాంచెస్ (పానీపూరి చాట్ బండార్ ) షాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వెంకటేష్ గౌడ్ అభినందించారు. అనంతరం కండె సాయి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ కాలయాపన చేయకుండా అందివచ్చిన ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్ల జగన్, తిరుపతయ్య, ముద్ద సాలయ్య శివ తదితరులు ఉన్నారు.



# బలహీన వర్గాల అభివృద్ధే సిపిఐ లక్ష్యం

- గడ్డం మనోహరాచారి

**పినపాక, విశాలభారతి:**
సిపిఐ 100 సంవత్సరాల వేడుకల్లో భాగంగా ఏడూళ్ళ బయ్యారం అడ్డరోడ్డులోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గడ్డం మనోహర చారి గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ వంద సంవత్సరాలుగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికై కృషి చేస్తుందని పేర్కొన్నారు. నాడు నేడు ఎప్పటికీ సిపిఐ పార్టీ ప్రజాపక్షపాతి అని అన్నారు. ప్రజా సంక్షేమమే సిపిఐ పార్టీ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# పైశాచిక ఆనందం ఎక్కువ కాలం నిలవదు

- మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కామెంట్స్

**మణుగూరు, విశాలభారతి:**
ఇందిరమ్మ రాజ్యమా? పోలీస్ రాజ్యమా? అడిగితే అరెస్టులు, ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు, ఈ పైశాచిక ఆనందం ఎక్కువ కాలం నిలవదు అని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఉదయాన్నే పోలీసులు ఇంటి వద్దకు వచ్చి అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమని,కుటుంబసభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి నోటీసు లేకుండా అరెస్ట్ చేయడం పూర్తిగా అప్రజాస్వామికమని అన్నారు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొడుతూ, రాక్షస పాలన కొనసాగిస్తున్నారు సెలవు రోజుల్లో కావాలని మా నేతలను అరెస్ట్ చేస్తూ, సీఎం నియంతలా వ్యవహరిస్తున్నారనీ మండిపడ్డారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పక్షం

**డోర్నకల్, విశాలభారతి:**
సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పక్షమని పేదలకు అత్యవసర సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పక్షాన నిలుస్తుందని మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి అన్నారు. గురువారం మరిపెడ మండలంలో స్థానిక విశ్రాంతి భవనం నందు లబ్ధిదారులకు మంజూరైన సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా గత పాలకుల ప్రభుత్వంలో కంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ని 10 లక్షలకు పెంచిందని, పేదలకు కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం అందించే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఒక సినిమా నుంచి నెలకుర్తి గ్రామానికి ఇప్పుడు వరకు ఐదు లక్షల చెక్కులను అందించినట్లు తెలిపారు.నిల్కుర్తి గ్రామానికి చెందిన మౌనిక గణేష్ లకు 24 వేల రూపాయల చెక్కును అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవి నాయక్, మరిపెడ టౌన్ అధ్యక్షులు తాజుద్దీన్, నియోజకవర్గ యుత్ జనరల్ సెక్రటరీ గాదేగాని నరేష్ గౌడ్, నేతావత్ తండ గ్రామ పార్టీ అధ్యక్షులు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



# బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర యూత్ అధ్యక్షులుగా నాగిళ్ల జగన్

**ఆమనగల్లు, విశాల భారతి :**
బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర యూత్ అధ్యక్షులుగా ఆమనగల్లుకు చెందిన నాగిళ్ల జగన్ నియమితులయ్యారు. గురువారం నగరంలోని బాబు జగజీవన్ రావు కొత్తపేట నందుబీసీ కులాల ఐక్యవేదిక నూతన రాష్ట్ర గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జగన్ ను రాష్ట్ర యూత్ అధ్యక్షులుగా ఎంపిక చేసి బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూర బ్రహ్మయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. తనకు రాష్ట్ర యూత్ అధ్యక్షులుగాఎన్నిక చేసినందుకు పెద్దవూర బ్రహ్మయ్య పగడాల ఎల్లయ్య జగన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పగడాల ఎల్లయ్య,శ్రీను,కుంచాల బ్రహ్మయ్య, శంకర్, ఆమనగంటి లక్ష్మణ్ చంద్రశేఖర్ స్వామి రాజేందర్ శ్రీనివాస్ నవీన్ ఉపేందర్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిపిఐ శత వార్షికోత్సవాల వేడుకలు ప్రారంభం

- అరుణ పతకాన్ని ఆవిష్కరించిన ధనుంజయ నాయుడు

**నేరేడుచర్ల విశాల భారతి.**
సిపిఐ పార్టీ శత వార్షికోత్సవాలను అరుణ పతాకాన్ని ఆవిష్కరించి నేరేడుచర్లలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రారంభించారు.. సిపిఐ సుదీర్ఘమైన పోరాటాలతో భారత స్వాతంత్రం తరువాత పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షంగా పని చేసిందని హైదరాబాద్ సంస్థాన రాచరిక ఫ్యూడల్ పాలన బద్దలు కొట్టి భారత యూనియన్ లో విలీనం చేయడంలో ప్రధాన పాత్ర పోషించిందని భూ సంస్కరణలను ఎజెండాలోకి తెచ్చి భాషా ప్రయుక్త రాష్ట్రాలకోసం పోరాడి సాధించిందని ఆయన అన్నారు.ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న దేశ స్వతంత్రం ఈరోజు అంబానీ, అధానీ ల పాలవుతుందని కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పనంగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కట్టబెడుతోందని, దేశంలో ఆర్ఎస్ఎస్ నియంత్రణలో ఉన్న బిజెపి ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్నదని, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు రంగానికి అమ్మివేస్తుందని,పౌర హక్కులను కలరాస్తున్నదని,నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నదని, కార్మికులు సుధీర్ఘ పోరాటాల ద్వారా సాధించకున్న సౌకర్యాలు, హక్కులు రిజర్వేషన్లు వీటిని రద్దు చేస్తున్నదని అన్నారు.ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోయిందని, రాజ్యాంగ సంస్థలు తమ పార్టీ అనుబంధ సంఘాలుగా మార్చి అధికార చేస్తున్నదని, వీటికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు ఐక్య ఉద్యమాలు చేయాల్సి ఉన్నదని, అందువల్ల సిపిఐ కార్యకర్తలు గర్వకారణ మైన గత చరిత్రను గమనంలో ఉంచుకుని ప్రజా సమస్యల మీద



సమరశీల పోరాటాలు నడపాలని, అందుకొరకు విశాలమైన వామపక్ష ప్రజాతంత్ర సెక్యులర్ ఐక్యత సాధించాలని, భారతదేశాన్ని ఫాసిస్టుల నుండి రక్షించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పట్టణ సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి,మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ లక్ష్మిఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను ఏఐటియుసి మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న, ఏఐఎస్ఎఫ్ నాయకుడుకొమ్రరాజు వెంకట్, కత్తి వెంకటరెడ్డి, గైగుళ్ళ శ్రీరాములు, వినయ్, పైకే భరత్ పానుగంటి మహేష్, బెజవాడ ధనమూర్తి, కల్లూరు సైదాచారి, ఉల్లెందుల దుర్గయ్య పాల్గొన్నారు.



# పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ
- జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ బొబ్బ సోమిరెడ్డి

**నర్సింహులపేట, విశాలభారతి:**
పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ బొబ్బ సోమిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దనాగారం, పెద్దనాగారం స్టేజి, గోపతండా, జగ్గు తండా గ్రామాలలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పులిచింత ఝాన్సీకి రూ. 60 వేలు, అజ్మీరా మాల్సూర్ కు రూ. 50 వేలు, అజ్మీరా మంక్తికి రూ. 23,500, భూక్యా శేషు కుమారికి రూ. 29,500 చెక్కులను డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపతండ మాజీ ఉప సర్పంచ్ రాజేందర్ నాయక్, శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ కొమ్ము పుల్లయ్య, అనిల్, బొబ్బ అశోక్ రెడ్డి, గుగులోతు రమేష్ నాయక్, బాణాల ప్రవీణ్, గాడుదల సోమలింగం, వెంకన్న, మదు, ఈరు నాయక్, బానోత్ లక్పతి, రమేష్, ప్రసాద్, బంగారియా, తదితరులు పాల్గొన్నారు.



# విలీన సభను విజయవంతం చేయండి

- ఐఎఫ్ టియు జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు

**నూతనకల్, విశాలభారతి:**
గతకొన్ని సంవత్సరాల క్రితం సిద్ధాంత పరంగా విడిపోయిన రెండు పార్టీలు ఈ చీలిక అనివార్యమైనదని భావించి తిరిగి విడిపోయిన ఎన్డీ నాయకత్వాన ఉన్నటువంటి క్యాడర్ మొత్తం కూడా న్యూడెమోక్రసీలో విలీనం అవుతున్నట్టు ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు అన్నారు. గతం లో చీలిపోవడం తప్పుగా భావించి నేడు తిరిగి న్యూడెమోక్రసీ పార్టీలో వీలినాన్ని ఆహ్వానిస్తున్నాం. ఈ ఐక్యత భవిష్యత్ రాజకీయాలకు మరింత ఉపయోగపడుతుంది అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. దేశంలో ఉన్నటువంటి అందరిని ఐక్యం చేయటం కోసం న్యూ డెమోక్రసీ పార్టీ నిరంతరం పనిచేస్తుందని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పాసిస్ట్ పరిపాలన కొనసాగిస్తుందని అన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం దేశ సంపదను మొత్తం కార్పొరేట్ల కు కట్టబెడుతుందని దుయ్యబట్టారు. దుర్మార్గమైనటువంటి చట్టాలను తీసుకువచ్చి రాజ్యాంగానికి విరుద్ధంగా పనిచేస్తుందని దుయపట్టారు. కార్యక్రమంలో పివై ఎల్ మండల నాయకులు ఉప్పుల మణికుమార్,మున్న మహేష్, గణేష్,పీల్లి మహేష్, గణేష్,చంటి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీజీవీ బ్యాంకుని తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్పు

- బ్యాంకు మేనేజర్ తిరుపతి

**ఆమనగల్లు, విశాలభారతి :**
అమనగల్లు మండలంలో ఇప్పటివరకు గల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ పేరును 1 జనవరి 2025 నూతన సంవత్సరం నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా పేరు మారుతున్నట్లుగా ఆమనగల్లు శాఖ బ్యాంకు మేనేజర్ తిరుపతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలలో ఉన్న పలు రకాల గ్రామీణ బ్యాంకులన్నింటినీ కలుపుతూ ఆయా రాష్ట్రం పేర్లపై గ్రామీణ వికాస బ్యాంకుగా పనిచేస్తున్న ఈ కొత్త సంవత్సరం నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంకు గా మారుతుందన్నారు. ఈ మార్పులు చేర్పులను చేయడానికి ఈనెల 28, 29,30,31 తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఖాతాదారులకు అన్ని రకాల సేవలు



నిలిపి వేస్తున్నట్టుగా తెలిపారు. ఈ నాలుగు రోజులలో బ్యాంకులో మార్పులు చేర్పులు జరుగుతాయన్నారు. ఫోన్ పే, గూగుల్ పే, ఆన్లైన్ సేవలు యూపీఐ, సేవలు నిలిచి పోతాయని,జనవరి 1వ తేదీ నుండి మళ్లీ ఖాతాదారులకు యధావిధిగా సేవలు అందిస్తామని మేనేజర్ తిరుపతి తెలిపారు.



# విజయ పాడి రైతులను ఆదుకోవాలి

- చైర్మన్ కి వినతి పత్రం అందజేత

**ఆమనగల్లు, విశాల భారతి:**
విజయ డైరీ పాడి రైతులకు పెండింగ్ లో ఉన్న పాల బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరుతూ గురువారం తెలంగాణ రాష్ట్ర విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్, కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో పలువురు నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా కడ్తాల పాల సితిలీకరణ కేంద్రం పరిధిలోగల విజయ డైరీ పాడి రైతులకు బిల్లులు చెల్లించడం లేదని వెంటనే పెండింగ్లో ఉన్న బిల్లులు చెల్లించి పాడి రైతులను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పరంగా సబ్సిడీపై పాడి రైతులకు అందుతున్న ఫీడ్ (దాన) అందే విధంగా చూడాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వపరంగా పాడి రైతులకు అందే ప్రోత్సాహకాలు అన్నింటిని వారికి అందే విధంగా చూడాలన్నారు. కడ్తాల్ పాలసీతిలీకరణ కు సంబంధించిన మిషనరీలు ( యంత్రాలు) పాతబడ్డాయని ప్రస్తుతం నూతనంగా అత్యాధునిక యంత్రాలను సమకూర్చి ఇక్కడి రైతులకు మేలు చేయాలని కోరారు. అదేవిధంగా పాల బిల్లులను పెంచాలని కోరినట్లు తెలిపారు. కడ్తాల్ చిల్లింగ్ సెంటర్ చుట్టూ ప్రహరీని నిర్మించేందుకు అధికంగా నిధులు మంజూరు చేయాలని కోరినట్లు గంప వెంకటేష్ గుప్తా పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుత్త అమిత్ రెడ్డిని గంప వెంకటేష్ గుప్తా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, కడ్తాల్ చిల్లింగ్ సెంటర్ సొసైటీ సభ్యులు సింగల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్ లు శాలువలు పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిల్లింగ్ సెంటర్ మేనేజర్ రాధిక, యాట నర్సింహ, కడారి రామకృష్ణ, జహంగీర్ అలీ, లాయఖ్ అలీ, హనుమా నాయక్, గాదె రాములు, గురిగళ్ళ లక్ష్మయ్య, అలగమోని సత్యనారాయణ, బాచిరెడ్డి రవీందర్ రెడ్డి, సిద్ధి గారి కుమార్, చేగూరు మహేష్, అలగమోని జగన్, బాచిరెడ్డి అశోక్ రెడ్డి, సిద్దిగారి బాలరాజ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# 21 రోజుల్లో రూ.1705 కోట్లు కలెక్ట్ చేసిన 'పుష్ప 2'



డిసెంబరు 4న ప్రీమియర్స్ షో నుంచే ఇండియన్ బాక్సాఫీస్‌పై మొదలైన పుష్పరాజ్ రూల్.. రోజు రోజుకి అత్యధిక కలెక్షన్లతో కొనసాగుతోంది. ఐకాన్ స్టార్ నట విశ్వరూపం బ్రిలియంట్ అండ్ జీనియస్ డైరెక్టర్ సుకుమార్ అత్యద్భుతమైన టేకింగ్..మెస్మరైజింగ్ కథ కథనాలు వెరసి.. పుష్ప-2 ది రూల్ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామి, సరికొత్త రికార్డుల మోత.. ఇండియన్ సినీ చరిత్రలో పుష్ప-2 సరికొత్త అధ్యాయం క్రియేట్ చేస్తోంది. ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, బ్రిలియంట్ దర్శకుడు సుకుమార్‌ల పుష్ప-2 ది రూల్.. చిత్రం ఇండియన్ బాక్సాఫీస్‌పై సరికొత్త రికార్డులను క్రియేట్ చేస్తోంది. ఈ సన్సేషన్ కాంబినేషన్‌లో అత్యున్నత నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ సుకుమార్ రైటింగ్ సంస్థతో కలిసి ఈ ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ సినిమాను నిర్మించింది. విడుదలకు ముందే ప్రీరిలీజ్ బిజినెస్‌లో ఇండియాలో సరికొత్త రికార్డును నెలకొల్పిన ఈ చిత్రం సినిమా విడుదల రోజు ప్రీమియర్‌స్ నుంచే సన్సేషనల్ బ్లాకబస్టర్ అందుకుంది. అల్లు అర్జున్ నట విశ్వరూపంకు, సుకుమార్ వరల్డ్ క్లాస్ టేకింగ్.. ప్రపంచ సినీ ప్రేమికులు ఫీదా అయిపోయారు. ముఖ్యంగా ఇండియాలో ఈ చిత్రం సృష్టించిన రికార్డుల పరంపరకు ఆకాశమే హద్దుగా ఉంది. సినిమా తొలి రోజు నుంచే కంటిన్యూగా వసూళ్లలో వరుసగా ఇండియా ఆల్‌టైమ్ రికార్డులు సృష్టించిన ఈ చిత్రం తాజాగా 21 రోజుల్లో రూ.1705 కోట్ల రూపాయాలు సాధించి ఇండియన్ సినిమా చరిత్రలోనే అత్యంత వేగవంతగా రూ.1700 కోట్లు కలెక్ట్ చేసిన తొలి చిత్రంగా సరికొత్త రికార్డును నెలకొల్పింది. కేవలం 21 రోజుల్లోనే రూ.1705 కోట్లు వసూలు చేసిన తొలి భారతీయ చిత్రంగా 'పుష్ప-2' ది రూల్ బాక్సాఫీస్‌పై సరికొత్త అధ్యాయాన్ని క్రియేట్ చేసింది. ప్రతి భాషలో సునామీలా దూసుకపోతున్న పుష్ప-2 ముఖ్యంగా బాలీవుడ్‌లో తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. బాలీవుడ్‌లో ఇప్పటి వరకు రూ. 700 కోట్లకు పైగా కలెక్ట్ చేసి వందేళ్ల బాలీవుడ్ చరిత్రలోనే సరికొత్త రికార్డులను క్రియేట్ చేస్తోంది.



# సంక్రాంతికి వస్తున్నాంలో వెంకీ పాడిన పాట


విక్టరీ వెంకటేష్ 'గురు' సినిమాలో తన ఎనర్జిటిక్ వోకల్స్ తో పాడిన జింగిడి జింగిడి సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ గా నిలిచింది. ఇప్పుడు మరోసారి సింగర్ గా అలరించబోతున్నారు వెంకటేష్. ఈ సారి, సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదల కానున్న తన మోస్ట్ అవైటెడ్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం' లోని ట్రాక్‌కి తన వాయిస్‌ని అందిస్తున్నారు. రీసెంట్ గా బిహైండ్ వీడియోలో దర్శకుడు అనిల్ రావిపూడి, హీరో వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి, నిర్మాత శిరీష్, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ ఎక్సయిటింగ్ డెవలప్మెంట్ ని రివిల్ చేశారు. మొదట్లో ఈ సినిమా స్పెషల్ ఫెస్టివల్ ట్రాక్ కోసం ప్రముఖ బాలీవుడ్ సింగర్‌ని తీసుకురావాలని అనిల్ రావిపూడి ప్లాన్ చేశారు. అయితే వెంకటేష్ తనకు అలవాటైన చార్మ్ తో ఆ పాటను తానే పాడాలనే కోరికను వ్యక్తం చేశారు. వెంకటేష్ ఉత్సాహంగా అవకాశాన్ని కోరడం, అనిల్ రావిపూడి అంగీకరించడం వీడియోలో ఇంట్రస్టింగ్ గా ప్రజెంట్ చేశారు. 'సంక్రాంతికి వస్తున్నాం'లోని ఈ వైబ్రెంట్ ఫెస్టివల్ ట్రాక్ ప్రస్తుతం RFCలో చిత్రీకరణజరుగుతోంది. ఈ చిత్రంలోని మొదటి రెండు పాటలు వైరల్ హిట్స్ గా నిలిచి ఇప్పటికే ప్రేక్షకులను అలరించాయి, ఇప్పుడు సంక్రాంతి స్పెషల్ సాంగ్ కోసం క్యూరియాసిటీ మరింత పెరిగింది. ఈ హై ఎనర్జీ పాటకు భాను మాస్టర్ కొరియోగ్రాఫర్.



# జోరు చూపలేకపోయిన జాన్వీ కపూర్!

బాలీవుడ్ బ్యూటీలలో జాన్వీ కపూర్ ఒకరు. ఒక వైపున సినిమాలు చేస్తున్నప్పటికీ, సోషల్ మీడియా ద్వారా ఆమెకి పెరుగుతున్న క్రేజ్ ఎక్కువనుకోవాలి. జాన్వీ కపూర్ హీరోయిన్ గా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి చాలాకాలమే అయింది. ఆమె అక్కడి ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి కూడా చాలా కాలం పాటు వెయిట్ చేసింది. ఆమె కోసం సరైన కథను ఎంపిక చేసుకోవడంలోనే ఆలస్యం జరుగుతూ వెళ్లింది. ఇంత చేసినా ఆమె ఆశించిన స్థాయిలో అక్కడ విజయాలను నమోదు చేయలేకపోయింది. ఇక శ్రీదేవి అంటే తెలుగు ప్రేక్షకులకు ఎంతో అభిమానం. అందువలన ఆమె కూతురైన జాన్వీ టాలీవుడ్ ఎంట్రీ ఎప్పుడు జరుగుతుందా అని వాళ్లంతా ఎంతో ఆతృతగా ఎదురుచూశారు. టాలీవుడ్ ఎంట్రీ కూడా అనుకున్నంత తేలికగా ఏమీ ఇవ్వలేదు. మొత్తానికి ఎన్టీఆర్ 'దేవర' సినిమాతో ఈ ఏడాది జాన్వీ టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. 'దేవర' సినిమాతో ఆమె ఇక్కడ బిజీ కావడం ఖాయమనే ప్రచారం, ఈ సినిమా రిలీజ్ కి ముందే జోరుగా జరిగింది. 'దేవర' సినిమాకి జాన్వీ ప్రత్యేక ఆకర్షణగా నిలవడం ఖాయమనే అంతా అనుకున్నారు. అయితే ఆశించిన స్థాయిలో జాన్వీ ఇక్కడి ఆడియన్స్ ను ఆకట్టుకోలేకపోయింది. ఆమె పాత్రను డిజైన్ చేసిన తీరు కూడా అందుకు కారణమనే టాక్ వినిపించింది. లవ్ .. రొమాన్స్ పాళ్లు తక్కువగా ఉండటం, డ్యూయెట్స్ కి ఎక్కువగా అవకాశం లేకపోవడం కూడా ఒక కారణమని చెప్పకున్నారు. ఒక మంచి కాంబినేషన్ చూసుకుని సెట్ చేసుకున్నప్పటికీ, ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ప్రభావితం చేయలేకపోయింది. పార్టు 2లో ఆమె పాత్ర జోరు ఎలా ఉంటుందో చూడాలి మరి.

# ఫిబ్రవరి 28, 'శబ్దం' వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్



'వైశాలి'తో సూపర్‌హిట్‌ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌లు రెండోసారి మరో ఇంట్రస్టింగ్ సూపర్‌నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ 'శబ్దం' కోసం చేతులు కలిపారు. 7G ఫిల్మ్స్ శివ, ఆల్ఫా ఫ్రేమ్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఎస్ బానుప్రియ శివ సహనిర్మాత. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజా మేకర్స్ 'శబ్దం' రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. ఫిబ్రవరి 28, 2025న ఈ చిత్రం వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ హీరో ఆది పినిశెట్టి ఇంటెన్స్ లుక్ అదిరిపోయింది. ఈ చిత్రాన్ని ముంబయి, మున్నార్, చెన్నైలోని అనేక ప్రదేశాలలో చిత్రీకరించారు. కేవలం ఇంటర్వెల్ సీక్వెన్స్ కోసమే 2 కోట్ల రూపాయల బడ్జెట్‌తో 120 ఏళ్ల నాటి లైబ్రరీ సెట్‌ను నిర్మించారు. సంగీత దర్శకుడు థమన్ సినిమా కోసం ప్రత్యేకమైన సౌండ్ ఎఫెక్ట్స్ ,ఆర్ఆర్ చేయడానికి హంగేరీకి వెళ్లాలని ప్లాన్ చేస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.